بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ     نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ     وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 19.06.2015 (Telugu)**

**ధర్మబద్ధత దృఢముగా మన హృదయములలో ఏర్పడవలెను. అల్లాహ్ తఆలా ప్రేమానురాగము మన ఆహారము కావలెను. మన ప్రతి కర్మ, మన ప్రతి మాట, కార్యము అల్లాహ్ తఆలా ఇష్టానుసారముండవలెను. మనము అతని ఆస్థానములో హాజరైనప్పుడు అతని ప్రీతి ఉత్తరము మనకు ప్రసాదించునట్లు వుండవలెను. నిజమైన రీతిలో ఇదంతా మనకు రమజాన్ ప్రసాదించునట్లు అల్లాహ్ చేయుగాక!**

*హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 19.06.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నేడు శుభదినమైన శుక్రవారము. పవిత్ర రమజాన్ మాసపు మొదటి రోజు. నేటి దినము అనంత శుభములతో మొదలగు పర్వదినము. శుభకరమైన జుమా దినపు ప్రాముఖ్యత గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వార్త నందించిరి. ఈ వార్త శాశ్వతముగా యుండును. విశ్వాసి తన దేవుని ఎదుట చేసిన ప్రార్థన ఆమోదించబడు ఒక ఘడియ ఈ రోజు వచ్చును. అనంతరం వారిట్లు ప్రవచించిరి. రమజాన్ మాసము ప్రారంభమైనప్పుడు స్వర్గ ద్వారములు తెరువబడును, నరకపు ద్వారములు మూసివేయబడును.

అల్లాహ్ తఆలా కరుణ ఈ నెలలో ప్రత్యేక ఉద్రేకము చెందును. విశ్వాసులపై అల్లాహ్ తఆలా కరుణ, శుభముల వర్షము కురియును. కాని ఈ శుభములను ఆకర్షించుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పలు నిబంధనలను విధించినారు. అనగా ఈ రోజులలో వృధా మాటలు మాట్లాడకూడదు, అల్లరి, దుష్టత్వమునకు పాల్పడకూడదు, దూషణలు, వివాదములు జరగకూడదు. ప్రతి దుష్టత్వమునకు సమాధానముగా ఉపవాసి ఇట్లనవలెను. నేను ఉపవాసిని. నేను అల్లాహ్ తఆలా కొరకు ఈ దుష్టత్వములన్నిటి నుండి దూరముంటున్నాను. ఈ స్థితి ఏర్పడినప్పుడు నిజముగా ఉపవాసము తెలియును. మానవుడు అల్లాహ్ తఆలా ఆదేశముల అనుసారము తన జీవితమును గడుపుటకు ప్రయత్నించును. రమజాన్ నెల ప్రాముఖ్యత ఏమిటి, ఎవరిపై ఉపవాసములు విధించబడినవి, ఎలా పాటించవలెను, ఏ ఆంక్షలు గలవు, దుఆల ఆమోదముతో అల్లాహ్ తఆలా దీనిని ఇట్లు జోడించెను. وَإِذَا سَأَلَكَ عِبَادِي عَنِّي فَإِنِّي قَرِيبٌ أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ فَلْيَسْتَجِيبُوا لِي وَلْيُؤْمِنُوا بِي لَعَلَّهُمْ يَرْشُدُونَ (అల్‌బఖరహ్: 187) అనగా నన్ను గూర్చి నా దాసులు నిన్ను ప్రశ్నించునప్పుడు నిశ్చయముగా నేను సమీపముననే వుందును. أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ నన్ను పిలుచుచు ప్రార్థించు వాని ప్రార్థనకు నేను సమాధానమిత్తును. కనుక వారు

సన్మార్గమునవంలభించుటకు సావధానులై నా ఆదేశములను వినవలయును. నా యందు విశ్వాసముంచ వలయును. రమజాన్ నెలలో వచ్చే జుమాల ప్రాధాన్యత రెట్టింపగును. రోజులు కూడ దుఆ ఆమోద రోజులు. రాత్రులు కూడ దుఆ ఆమోద రోజులు. ఏ ఘడియలో దుఆ ఆమోదించబడునో తెలియదని అల్లాహ్ తఆలా అనును. అందుకే పగలును కూడ, రాత్రులను కూడ దుఆలలో గడుపుము. కనుక మనము ఈ రోజులతో అధికాధికముగా లబ్ది పొందవలెను. ఒకటి అల్లాహ్ తఆలా షైతాన్‌ను బంధించి స్వర్గ ద్వారములను తెరిచెను. దాసుల సమీపమునకు చేరెను. రమజాన్ జుమాలతో కూడ సంపూర్ణముగా లబ్ది పొందవలెను. ఈ రోజులలో అవసరమైన అన్నిటికంటే ముఖ్యమైన దుఆ ఏమనగా అతి వినయ, విధేయతగా మానవుడు అల్లాహ్ తఆలాతో ఇట్లు దుఆ చేయవలెను. ఓ అల్లాహ్! నన్ను కేవలం రమజాన్‌లోనే కాక సాధారణ స్థితులలో కూడ పగలు, రాత్రులలో దుఆలు ఆమోదించబడు ప్రజలలో నన్ను చేర్చుము. కనుక రమజాన్ ఒక పవిత్ర మార్పునకు కారణము కావలెను. నేను కూడ శాశ్వత మార్గదర్శనము పొందువారిలో చేరుదును గాక!. గత సూక్తులలో ఉపవాసముల విధింపు గూర్చి అల్లాహ్ తఆలా చెప్పినప్పుడు ఇంతకు ముందు జాతులపై కూడ ఉపవాసము విధించబడినదని తెలిపెను. గత జాతులు ఉపవాసము యున్నందున మీరు కూడ ఉపవాసములు యుండవలెనని దీని భావము కాదు. దీని చివరలో لَعَلَّكُمْ تَتَّقُونَ అనబడెను. అనగా మీరు ధర్మబద్ధత అవలంభించి, ఆధ్యాత్మిక, సత్‌ప్రవర్తన లోపముల నుండి దూరము కాగలరు.

ఇక్కడ నేను చదివిన సూక్తి చివరలో అల్లాహ్ తఆలా لَعَلَّهُمْ يَرْشُدُونَ మార్గదర్శనము పొందుమని అనెను. రుష్ద్ అనగా సరియైన సన్మార్గము. సరియైన కర్మ, మార్గదర్శన దారి సరియైన సత్‌ప్రవర్తనలు వివేకము, తెలివిని వినియోగించుట, దానిని ఆచరించుట తమ స్థితిని చక్కదిద్దుకొనుట, గట్టిగా నిలబడుట. మానవుడు అల్లాహ్ తఆలా ఎదుట వినయముతో నిలబడినప్పుడు దుఆల ఆమోద దృశ్యమును కూడ చూడును. ధర్మబద్ధత, సత్కార్యముపై నిలబడుచు, విశ్వాసము, నమ్మకములో దృఢమగును. ఈ విధముగా అల్లాహ్ తఆలా శుభములను పొందును.

రమజాన్ అనంత శుభముల మాసము. కాని అల్లాహ్ తఆలా ఆదేశములను స్వీకరించుచు, విశ్వాసములో పెరగవలెను. సత్కార్యము, ధర్మబద్ధతపై నిలుచుచు మాత్రమే తమ ఉద్దేశమును పొందవచ్చునని గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలా మన కొరకు విధించిన ఫలములు వ్యక్తిగతముగా కూడ, జమాఅత్ పరంగా కూడ మనకు లభించును. నేను చెప్పినట్లు మనము వినయ, విధేయత ప్రదర్శించుచు తమ పొరపాట్లను ఒప్పుకొని అల్లాహ్ తఆలాను పొందుటకు కృషి చేసినచో అల్లాహ్ తఆలా శుభముతో ఫలములు అందును. మానవునిలో తప్పులు యున్నను, పాపిష్టుడు అయినను, పొరపాటు చేసినను, అతని హృదయములో అల్లాహ్ తఆలా భయము యున్నంత వరకు, తప్పులను అంగీకరించినత వరకు అల్లాహ్ తఆలా పాపములను కప్పిపుచ్చుచుండును. తుదకు ఒక రోజు అతనికి పశ్చత్తాపము చేయు అనుగ్రహము లభించును. మనలోని ప్రతి ఒక్కరికి మన కొరకు, బంధువుల కొరకు, జమాఅత్ సభ్యులకు అల్లాహ్ తఆలా నిష్టాపరత లభించవలెనని అన్నిటికంటే ఎక్కువ ఈ రోజులలో దుఆ చేయవలెను. మనము పరస్పరము బాధతో దుఆ చేసినప్పుడు దేవదూతలు కూడ మన కొరకు దుఆలో చేరుదురు. రమజాన్ నిజమైన, శాశ్వత శుభముల దృశ్యములను కూడ చూడగల వారమగుదుము. ధర్మబద్ధత ఏమిటి ? అల్లాహ్ తఆలా భయము, భక్తియే ధర్మబద్ధత. మనలో అల్లాహ్ తఆలా భయము, భక్తి యున్నంత వరకు మన లోపములను, పాపములను అల్లాహ్ తఆలా కప్పిపుచ్చును. మనము

అతని రక్షణలో యుందుము.

ఈ నెల శుభములతో లబ్ది పొందుటకు మనలోని ప్రతి ఒక్కరు అల్లాహ్ తఆలా దాసుడగుటకు ప్రయత్నించవలెను. మన అసమర్థతల వలన కొంత సమయము కొరకు దుఆలను వెనక్కి నెట్టినను బాలుని సంస్కరణ కొరకు అతని దయామయురాలైన తల్లి కొంత సమయము కొరకు కోపముతో దూరమైనట్లు అగును. ఇందులో కఠిన కోపముండదు. కాని బాలునికి తల్లితో యున్న ప్రేమ వలన ఆమె వైపు పోయినప్పుడు ఆమె ఛాతికి హత్తుకొనును. అంతకు ముందు కూడ బాలుడు నా వద్దకు వచ్చుచున్నాడా లేదా అని అతనికి తెలియకుండా చూచుచుండును. బాలుడు దగ్గరికి వచ్చినప్పుడు కోపము దూరమగును. తల్లుల కంటే అధికముగా క్షమించు అల్లాహ్ తఆలా నా దాసులు పశ్చాత్తాపడుచు ఎప్పుడు నా వైపు వత్తురని చూడును, అనంతరం క్షమించును కూడ. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! జనావాసము లేని అడవిలో పోగొట్టుకున్న ఒంటె ఒక వ్యక్తికి లభించినప్పుడు కలిగే ఆనందము కంటే ఎక్కువ దాసుడు పశ్చాత్తాపపడ్డప్పుడు అల్లాహ్ సంతోషపడును. ఈ రమజాన్ నెల ఎందుకు వచ్చుననగా దాసుడు అల్లాహ్ తఆలా ప్రేమను హృదయములో కలిగియుండి, సంవత్సరమంతా లోపములకు, పొరపాట్లకు పాల్పడినను అతని పశ్చాత్తాపమును అల్లాహ్ తఆలా ఆమోదించవలెనను ఉద్దేశముతో వచ్చినచో అల్లాహ్ తఆలా పరుగెత్తి అతనిని హత్తుకొనును. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఎవరైనా జానెడు నాకు సమీపమైనప్పుడు నేను గజము సమీపమగుదును. అతడు నాకు ఒక చెయ్యి సమీపమైనప్పుడు నేను రెండు చేతులు సమీపమైదును. నా వైపు నడిచి వచ్చిన వాని వైపు నేను పరుగెత్తెదను. తల్లుల కంటే గొప్ప దయామయుడైన అల్లాహ్ తఆలా, పశ్చాత్తాపమును ఆమోదించుటకు, తన దాసునితో సంతోషపడుటకు అనేక మార్గములు సృష్టించెను. దాసుడు వీటితో లబ్ది పొందనిచో ఇది దాసుల దురదృష్టము, వారి కఠిన మనస్తత్వము. అల్లాహ్ తఆలా ప్రేమను ఈ ఉదాహరణలతో పోల్చబడినను వాస్తవానికి అల్లాహ్ తఆలా ప్రేమ స్వరూపము ఈ ఉదాహరణల కంటే చాలా గొప్పది. అల్లాహ్ తఆలా ఎంతటి ప్రేమానురాగముతో దాసుని వైపు చూడునో దానిని మనము వర్ణించలేము. హదీసులతో కూడ ఇది స్పష్టమైనది. ప్రేమ గూర్చి ఈ ఉదాహరణ ఇవ్వబడినను వాస్తవానికి ఇది ప్రేమ గొప్పతనమును చాటిచెప్పును. అయినను అల్లాహ్ తఆలా ప్రేమ ఉదాహరణ మీ ఈ ప్రాపంచిక ఉదాహరణల కంటే చాలా ఉన్నతమైనది. దానిని అందుకొనుట చాలా కష్టము. ఈ ప్రేమ గురించి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించిన మరో ఉదాహరణ నేను ప్రవేశ పెట్టెదను. బదర్ యుద్ధములో శత్రువు ఓటమి చెందినప్పుడు యుద్ధము దాదాపు ముగిసిపోయెను. అవిశ్వాసుల గొప్ప గొప్ప వీరులైన సైనికులు తమ తమ అశ్వములపై కూర్చొని కొరడాతో వాటిని కొట్టుచు యుద్ధ భూమి నుండి పారిపోవుటకు, ముస్లిముల నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుచుండిరి. అప్పుడు ఒక మహిళ యుద్ధ భూమిలో నిర్భయముగా సంచరించుచుండెను. ఆమెకు ఒక ఉద్రేకము, పిచ్చితనము కలిగియుండెను. ఒక సారి ఒక బాలున్ని ఎత్తుకొనగా మరోసారి మరో బాలున్ని ఎత్తుకొంటుంటెదును. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మహిళను చూచి, ఈ మహిళ బాలుడు తప్పిపోయినాడు, అతన్ని ఆమె వెతుకుచున్నదని అనిరి. తల్లి ప్రేమ వలన ఇది యుద్ధ భూమి, ఇక్కడ అల్లకల్లోము ఏర్పడినదనే భయము ఆమెకు లేదు. ఆ మహిళ అటులనే పిచ్చితనముతో తిరిగెను. ఏ బాలున్ని చూచినా ఛాతితో హత్తుకొనుచుండెను. కాని గమనించి చూడగా తన స్వంత బాలుడు కాదని తెలిసినప్పుడు విడిచి పెట్టేది. తుదకు ఆమెకు తన బాలుడు లభించెను. అతన్ని ఛాతికి హత్తుకొని, తనతో గట్టిగా పట్టుకొని ముద్దాడి నిర్భయముతో అక్కడే కూర్చొనెను. కాని

అంతకు ముందు బాలున్ని వెతుకుచున్నప్పుడు ఎంత వ్యాకులత, ఆందోళన, బాధ వ్యక్తమగుచుండెను. మరల వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. తన దాసులతో అల్లాహ్ తఆలా ప్రేమ ఉదాహరణ ఇటులనే యుండును. వాస్తవానికి అతడు ఇంత కంటే ఎక్కువ ప్రేమించును. తన పాపములు, తప్పిదముల వలన దాసుడు తన అల్లాహ్‌ను పోగొట్టుకున్నప్పుడు తన బాలున్ని పోగొట్టుకున్న ఈ మహిళ వలె దుఃఖము కలుగును. అనంతరం దాసుడు పశ్చత్తాపపడి తిరిగి వచ్చినప్పుడు తన బాలుడు దొరికినందుకు ఈ మహిళ కలిగిన ఆనందము కంటే ఎక్కువ ఆనందపడును. మనము కూడ అల్లాహ్ తఆలా క్షమాపణను పొందుటకు సిద్ధమై బయలు దేరినప్పుడు అతడు కూడ క్షమించుటకు సిద్ధముగా యుండును.

ఇంతటి ప్రియమైన దేవుడు మన దేవుడు అయినప్పుడు ఎంత వరకు త్యాగము చేసి మనము అతని వైపు పోవలసిన అవసరమున్నది. ఎంత వరకు మనము అతని దాసునిగా కావలసిన అవసరమున్నది. ఈ పవిత్ర మాసములో లోపములను కప్పిపుచ్చు, పాపములను క్షమించు అల్లాహ్ తఆలా వైపు పరుగెత్త వలసిన అవసరమున్నది. అతని ముందు మోకరిల్లుటకు సంపూర్ణ కృషి చేయవలసిన అవసరమున్నది. షైతాన్ ప్రతి కోణములో నిలిచి మనలను బంధించు ప్రయత్నములో యున్నాడు. కాని అతన్ని ఎదురించుచు, అల్లాహ్ తఆలా ఆశ్రమము పొందుచు అతని ప్రతి దాడి నుండి సురక్షితముగా యుండుచు, అతన్ని అసఫలము చేయవలెను. అప్పుడు మనము రమజాన్‌తో నిజమైన రీతిలో ప్రయోజనము పొందగలము. మనము మన దుఆలను మన ఉనికి వరకు, లేదా మన బంధువుల వరకు పరిమితం చేయకుండా చాలా విశాలత కల్పించవలసిన అవసరమున్నది. అప్పుడు మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమఅత్‌లో యున్న హక్కును చెల్లించగలము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో చేర్పించి అల్లాహ్ తఆలా మనపై చేసిన ఉపకారమునకు కృతజ్ఞతలు తెలిపినవారమగుదుము. ఈ జమాఅత్‌లో మనము చేరడంతోనే పని ముగియలేదు. మనము అహ్మదీ అయినాము, బైఅత్ చేసినామని అనుకొనుటకు సరిపోదు. ఒక గొప్ప బాధ్యత అల్లాహ్ తఆలా మనపై మోపెను. ఈ బాధ్యతను నిర్వర్తించుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆ వైపు మన శ్రద్ధ కలిగించిరి. తద్వారా మనము జమాఅత్ ప్రగతిలో సహాయకులము కావచ్చును. మనము బలహీనులము, శక్తిహీనులము. మా తప్పిదములను అంగీకరించుచున్నాము. అసమర్థతలను కూడ ఒప్పుకొంటున్నాము. ఇవన్ని యున్నను అల్లాహ్ తఆలా ఒక గొప్ప ఉద్దేశమును పొందు బాధ్యత మోపిన వ్యక్తులము మనము. అల్లాహ్ తఆలా అనుగ్రహమును ఆకర్షించనిదే ఈ బాధ్యతను నిర్వర్తించలేము.

కనుక దుఆల వైపు మనము అధిక శ్రద్ధ వహించవలసిన అవసరమున్నది. మేము బలహీలనులము, శక్తిహీనులము, కాని పని అధికముగా యున్నది. ఈ రోజులలో చాలా ఎక్కువ దుఆలు చేయవలెను. తమ కొరకు కూడ, ఒకరు మరొకరి కొరకు కూడ, జమాఅత్ అభివృద్ధి కొరకు కూడ. శత్రువు అసఫలము, ఓటమి కొరకు కూడ. అల్లాహ్ తఆలా వైభవము, గొప్పతనము బహిర్గతమగుటకు కూడ, ప్రపంచము దైవ ఉనికిని నిరాకరించుచు పోవుచున్నది. అల్లాహ్ తఆలాను గుర్తించును గాక! అల్లాహ్ తఆలా మన పాపములను, బలహీనతలను క్షమించుగాక! (ఆమీన్) ✡ ✡ ✡

*Summarised by: Majlis Ansarullah Bharat*

*Translated By Hafiz Syed Rasool Niyaz For Telugu Desk*

*From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab*

**సయ్యిద్నా హుజూరె అన్వర్ ఆమోదముతో మజ్లిస్ అన్సారుల్లాహ్ భారత్ 25 జూలై 2015 నుండి 15 అక్టోబర్ 2015 వరకు డైమండ్ జూబ్లి (వజ్రోత్సవము) జరుపుకుంటున్నది.**